16వ అధ్యాయం

# వర్షం కొరకు నమాజ్ (సలాతుల్ ఇస్తిస్ఖా)

# ١٦ - بَابُ صَلَاةِ الِاسْتِسْقَاءِ

406. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారు ఇలా తెలిపారు - "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో అణకువతో, నిరాడంబరమైన దుస్తుల్లో వినయ వినమ్రతలు ఉట్టిపడుతుండగా (వర్షం కొరకు వేడుకునే ఉద్దేశ్యంతో) నమాజ్కై బయటికి వెడలారు. పండుగ నమాజ్ మాదిరిగా ప్రజలకు రెండు రకతుల నమాజ్ చేయించారు. మీ ప్రసంగం వలె ప్రసంగించలేదు." (ఈ ఉల్లేఖనాన్ని ఐదుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ, అబూ అవానా, ఇబ్నె హిబ్బాన్లు దీనిని ప్రామాణికమయిన హదీసుగా ఖరారు చేశారు)

(٤٠٦) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنهما قَالَ: خَرَجَ النَّبِيُّ ﷺ مُتَوَاضِعاً، مُتَبَذِّلاً، مُتَخَشِّعاً، مُتَرَسِّلاً، مُتَضَرِّعاً، فَصَلَّى رَكْعَتَيْنِ، كَمَا يُصَلِّي فِي الْعِيدِ، لَمْ يَخْطُبْ خُطْبَتَكُمْ هٰذِهِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَأَبُو عَوَانَةَ وَابْنُ حِبَّانَ.

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) 'నమాజె ఇస్తిస్ఖా' సామూహికంగా చేసినట్టు ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. 'ఇస్తిస్ఖా' అంటే నీళ్ల కోసం అర్థించటం, దరఖాస్తు పెట్టుకోవటం అని అసలు అర్థం. షరీయత్ పరిభాషలో 'ఇస్తిస్ఖా' అంటే ఒక ప్రత్యేక స్ఫూర్తితో, భావోద్రేకంతో దైవసమక్షంలో మొరపెట్టుకోవటం అని భావం. ఇస్తిస్ఖా మూడు రకాలు. (1) అల్పస్థాయి ఇస్తిస్ఖా (2) మధ్య స్థాయి ఇస్తిస్ఖా (3) ఉన్నతస్థాయి ఇస్తిస్ఖా.

అల్పస్థాయి ఇస్తిస్ఖాలో వర్షం కోసం సాధారణంగా దుఆ చేయటం జరుగుతుంది. మధ్య రకం ఇస్తిస్ఖాలో నమాజ్ తరువాత వర్షాన్ని కోరుతూ వేడుకోవటం జరుగుతుంది. ఉన్నతస్థాయి ఇస్తిస్ఖాలో కొంతమంది కలసి, ఓ ప్రత్యేక వాతావరణాన్ని సృజిస్తారు. ఏదయినా బహిరంగ ప్రదేశంలో అందరూ ఒకచోట చేరి అత్యంత అణకువతో, ఆర్ద్రతతో దైవకారుణ్యంపట్ల పూర్తి ఆశతో, నమ్మకంతో ప్రార్థన చేస్తారు. దైవసమక్షంలో తమ అశక్తతను వెల్లడిస్తూ, వర్షం కురిపించి కష్టాలు తీర్చమని దీనాతిదీనంగా దుఆ చేస్తారు. ఇది ఉన్నతస్థాయి ఇస్తిస్ఖాగా భావించబడుతుంది.

దైవప్రవక్త (సఅసం) కేవలం 'దుఆ' ద్వారా కూడా వర్షాన్ని అర్థించినట్లు ఆధారాలున్నాయి. ఒకసారి ఆయన (స) జుమా ప్రసంగం చేస్తుండగా ఒక వ్యక్తి లేచి నిలబడి వర్షం కోసం దైవాన్ని

ప్రార్థించమని ఆయన్ని (స) అభ్యర్థించాడు. ఆయన (స) వేదికపై నిలబడి దుఆ చేశారు. దేవుడు ఆయన (స) మొరను ఆలకించాడు. వర్షం మొదలయింది. తరువాతి శుక్రవారం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. ఉపన్యాసకుడు ఉపన్యాస వేదికనుండి వర్షం కోసం ప్రార్థించవచ్చునన్నదానికి ఈ సంఘటన ఒక దృష్టాంతం. ఆ సమయంలో అతడు ఖిబ్లా వైపునకు తిరిగి ఉండవలసిన అవసరం లేదు. ఖుత్బా సమయంలో ఖతీబ్ (ప్రసంగకర్త)తో అత్యవసరమయిన అభ్యర్థన చేసుకో వచ్చునీ, ఖతీబ్ కూడా ఇతరుల అభ్యర్థనలను ఆమోదించవచ్చునీ ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది.

దైవప్రవక్త (సఅసం) గారు నమాజె ఇస్తిస్ఖాను పండుగ నమాజ్ తరహాలో చేసేవారని ఈ హదీసు చెబుతోంది. నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా చేసే ప్రసంగం చాలా సంక్షిప్తంగా ఉండాలి. ప్రసంగ ఉద్దేశ్యాన్ని ప్రసంగకర్త విస్మరించకూడదు. విషయంతో సంబంధం లేని మాటలను ప్రస్తావించి ఎక్కువ సమయం వృధా చేయకూడదు. షాహ్ వలీయుల్లాహ్ ముహద్దిస్ దహెల్వీ (రహ్మ.లై) తన విశ్వవిఖ్యాత పుస్తకం "హుజ్జతుల్లాహిల్ బాలిఘ"లో ఇలా వ్రాశారు:

"దైవప్రవక్త (స) గారి నమాజె ఇస్తిస్ఖా గురించి పలు ఉల్లేఖనాలు ఉన్నాయి. మస్నూన్ (సాంప్రదాయిక) పద్ధతి ఏమంటే పట్టణ (లేక గ్రామ) ప్రజలంతా ఒకచోట - బహిరంగ ప్రదేశంలో - సమావేశమవ్వాలి. చినిగిన దుస్తులు (పాతబట్టలు) ధరించాలి. భయభక్తులతో, కుమిలిపోతూ దైవాన్ని వేడుకోవాలి. ఆ తరువాత ఇమామ్ వారికి రెండు రకతుల నమాజ్ చేయించాలి. ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా చేయాలి. తరువాత ప్రసంగించాలి. ఖిబ్లా వైపునకు తిరిగి 'దుఆ' చేయాలి. ఈ సమయంలో దుప్పటిని తిరగవేయాలి."

(٤٠٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: شَكَا النَّاسُ إِلَى رَسُولِ اللّٰهِ ﷺ قُحُوطَ الْمَطَرِ، فَأَمَرَ بِمِنْبَرٍ، فَوُضِعَ لَهُ فِي الْمُصَلَّى، وَوَعَدَ النَّاسَ يَوْماً يَخْرُجُوْنَ فِيْهِ، فَخَرَجَ حِيْنَ بَدَا حَاجِبُ الشَّمْسِ، فَقَعَدَ عَلَى الْمِنْبَرِ، فَكَبَّرَ وَحَمِدَ اللّٰهَ، ثُمَّ قَالَ: **إِنَّكُمْ شَكَوْتُمْ جَدْبَ دِيَارِكُمْ، وَقَدْ أَمَرَكُمُ اللّٰهُ أَنْ تَدْعُوْهُ، وَوَعَدَكُمْ أَنْ يَسْتَجِيْبَ لَكُمْ**، ثُمَّ قَالَ: **اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ، الرَّحْمٰنِ الرَّحِيْمِ، مَالِكِ يَوْمِ الدِّيْنِ، لَا إِلٰهَ إِلَّا اللّٰهُ، يَفْعَلُ مَا يُرِيْدُ، اللّٰهُمَّ أَنْتَ اللّٰهُ، لَا إِلٰهَ إِلَّا أَنْتَ، أَنْتَ الْغَنِيُّ، وَنَحْنُ الْفُقَرَاءُ، أَنْزِلْ عَلَيْنَا الْغَيْثَ، وَاجْعَلْ مَا أَنْزَلْتَ عَلَيْنَا قُوَّةً وَبَلَاغاً إِلَى**

407. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : వర్షాలు కురవకపోవటం మూలంగా కరువు ఏర్పడిందని ప్రజలు దైవప్రవక్త (సఅసం)కు ఫిర్యాదుచేసుకున్నారు. వేదిక (మింబర్)ను ఈద్గాహ్‌కు తరలించమని ఆయన (స) ఆజ్ఞాపించారు. వేదిక ఈద్గాహ్‌కు తరలించబడింది. ప్రజలు ఒక రోజు తామంతా బహిరంగ ప్రదేశానికి వస్తామని వాగ్దానం చేశారు. ఆయన (సఅసం) స్వయంగా ఆ రోజు ఉదయం ఇంటినుండి వెడలి వచ్చారు. సూర్యుడు ఆకాశపుటంచున ఉదయించగానే ఆయన వచ్చి వేదికపై కూర్చున్నారు. అల్లాహు అక్బర్ అని పలికి, ఆ తరువాత దైవస్తోత్రం చేశారు.

حِيْنٍ. ثُمَّ رَفَعَ يَدَيْهِ، فَلَمْ يَزَلْ حَتَّى رُئِيَ بَيَاضُ إِبِطَيْهِ، ثُمَّ حَوَّلَ إِلَى النَّاسِ ظَهْرَهُ، وَقَلَّبَ رِدَاءَهُ، وَهُوَ رَافِعٌ يَدَيْهِ، ثُمَّ أَقْبَلَ عَلَى النَّاسِ، وَنَزَلَ، وَصَلَّى رَكْعَتَيْنِ، فَأَنْشَأَ اللّٰهُ تَعَالَى سَحَابَةً، فَرَعَدَتْ، وَبَرَقَتْ، ثُمَّ أَمْطَرَتْ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَقَالَ: غَرِيْبٌ، وَإِسْنَادُهُ جَيِّدٌ.

దేవుని గొప్పదనాన్ని కొనియాడారు. తరువాత (ప్రజలనుద్దేశ్యించి) సెల విచ్చారు - "మీరు మీమీ ప్రాంతాల్లో సంభవించిన దుర్భిక్షం గురించి ఫిర్యాదు చేశారుకదూ! తనను వేడుకోమనీ, తాను మీ మొరలను ఆలకించి ఆమోదిస్తానని అల్లాహ్ ఆదేశించాడు." ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు - "ప్రశంసలు పొగడ్తలు సర్వలోక ప్రభువైన అల్లాహ్‌కే శోభిస్తాయి. జనుల పాలిట ఆయన అపార కరుణామయుడు. పరమకృపాశీలుడు. తీర్పు దినపు యజమాని. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయన తలచుకున్న దల్లా చేసితీర్తాడు. దేవా! నీవే దైవానివి. నీవు తప్ప మరో పూజనీయుడు లేడు. నీవు అక్కరలేనివాడవు. మేము అభాగ్యులము, నిరాధార జీవులము. మాపై నీ కారుణ్యాన్ని కురిపించు. నీవు మాపై కురిపించే దానిని మా కొరకు ఉపాధిగా, సుదీర్ఘకాలం దాకా సమకూరే సాధనంగా చెయ్యి." ఆ తరువాత ఆయన (సఅసం) తన రెండు చేతుల్నీ పైకి ఎత్తారు. అవి క్రమక్రమంగా పైకి లేవసాగాయి. ఆ సమయంలో ఆయన చంకల తెలుపుదనం సయితం కానరాసాగింది. తరువాత ఆయన ప్రజలకు వెన్నుచూపి నిలబడ్డారు. తన (భుజాలపై ఉన్న) దుప్పటిని తిరగవేసుకున్నారు. ఆ సమయంలో ఆయన (స) తన రెండు

చేతుల్నీ పైకి లేపి ఉన్నారు. ఆ పైన ఆయన (స) ప్రజల వంక తిరిగారు. వేదిక దిగివచ్చి రెండు రకతుల నమాజ్ చేయించారు. ఆ క్షణంలోనే అల్లాహ్ ఆకాశంలో మేఘాలు సృజించాడు. అవి దట్టంగా క్రమ్ముకున్నాయి, గర్జించాయి, మెరుపు తీగలు మెలిక తిరిగాయి, వర్షం కురవసాగింది. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఈ హదీసు 'గరీబ్' కోవకు చెందినదిగా భావించబడింది - అయితే హదీసు అందిన పరంపర మాత్రం ఉత్తమంగా ఉంది)

وَقِصَّةُ التَّحْوِيْلِ فِي الصَّحِيْحِ مِنْ حَدِيْثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ، وَفِيْهِ: فَتَوَجَّهَ إِلَى الْقِبْلَةِ يَدْعُو، ثُمَّ صَلَّى رَكْعَتَيْنِ، جَهَرَ فِيْهِمَا بِالْقِرَاءَةِ.

సహీహ్ బుఖారీలో అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖనంలో దుప్పటి (తిప్పు కున్న) సంఘటన ఇలా వుంది - "ఆయన (స) ఖిబ్లా వైపునకు తిరిగారు. దుఆ చేయసాగారు. అనంతరం రెండు రకతుల నమాజ్ చేయించారు. ఈ సందర్భంగా బిగ్గరగా ఖుర్ఆన్ పారాయణం చేశారు."

وَلِلدَّارَقُطْنِيِّ مِنْ مُرْسَلِ أَبِي جَعْفَرٍ الْبَاقِرِ: وَحَوَّلَ رِدَاءَهُ لِيَتَحَوَّلَ الْقَحْطُ.

దారె ఖుత్నీలో అబూ జాఫర్ బాఖిర్ గారి 'ముర్సల్' ఉల్లేఖనం లో, "దుర్భిక్షం కూడా ఈ దుప్పటి మాదిరిగా మారిపోవాలన్న దానికి సంకేతంగా ఆయన (స) దుప్పటిని తిరగవేశారు" అని వుంది.

**సారాంశం**

'నమాజె ఇస్తిస్ఖా' సందర్భంగా మస్జిద్‌లోని వేదికను బహిరంగ స్థలానికి తీసుకు వెళ్లవచ్చునని దీని ఆధారంగా తెలుస్తున్నది. పండుగ నమాజ్ కొరకు వేదికను ఉపయోగించలేరు. నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా చేతులు బాగా పైకెత్తి దుఆ చేయాలని కూడా ఈ హదీసు చెబుతోంది. హజ్రత్ అనస్ (రజి) మాటల్లోనే చెప్పాలంటే దైవప్రవక్త (సఅసం) ఈ సందర్భంగా చేతులు

పైకెత్తినంతగా మరెన్నడూ ఎత్తలేదు. చేతులెత్తి దుఆ చేసే విషయమై ఇమామ్ నవవీ (రహ్మ.లై) 30 హదీసులను సేకరించారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే చేతులెత్తి వేడుకోవటం కూడా సంప్రదాయమే. ప్రసంగం 'బిస్మిల్లాహ్' తో కాకుండా 'అల్ హమ్దులిల్లాహ్'తో ఆరంభించాలన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా మన ముందుకు వచ్చింది. దైవస్తోత్ర వచనాలతో తప్ప వేరే వాక్యాలతో ప్రసంగాన్ని మొదలెట్టడం సమంజసం కాదు.

## హదీసు ఉల్లేఖకులు (అబూ జాఫర్ బాఖిర్ - రహ్మ.లై)

అసలు పేరు ముహమ్మద్ బిన్ అలీ జైనులాబిదీన్ బిన్ హుసైన్ బిన్ అలీ బిన్ అబూ తాలిబ్. అబూ జాఫర్ బాఖిర్ మారుపేరు. ఈయన హజ్రత్ అలీ (రజి)గారి మనవడు. హజ్రత్ హుసైన్ (రజి) గారి కుమారుడు. షియా వర్గం నమ్మకం ప్రకారం వాళ్ల 12 ఇమాముల పరంపరలో ఈయన ఐదవవారు. ఈయన జ్ఞానసంపద అపారమైనది. అందుకే ఈయన 'బాఖిర్' గా పిలువబడ్డారు. గొప్పపండితులు. హి॥జ్రీ 56లో జన్మించారు. హి॥జ్రీ 117లో 63 ఏళ్ళ వయస్సులో మరణించారు. జన్నతుల్ బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

(٤٠٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً دَخَلَ الْمَسْجِدَ يَوْمَ الْجُمُعَةِ، وَالنَّبِيُّ ﷺ قَائِمٌ يَخْطُبُ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! هَلَكَتِ الْأَمْوَالُ، وَانْقَطَعَتِ السُّبُلُ، فَادْعُ اللَّهَ يُغِيثُنَا، فَرَفَعَ يَدَيْهِ، ثُمَّ قَالَ: «اللَّهُمَّ أَغِثْنَا، اللَّهُمَّ أَغِثْنَا، اللَّهُمَّ أَغِثْنَا»، فَذَكَرَ الْحَدِيثَ. وَفِيهِ الدُّعَاءُ بِإِمْسَاكِهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

408. హజ్రత్ అనస్ (రజి) కథనం : ఒక వ్యక్తి శుక్రవారం నాడు మస్జిద్‌లో ప్రవేశించాడు. ఆ సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిలబడి ఉపన్యసిస్తున్నారు. 'ఓ దైవ ప్రవక్తా (స)! (పశు) సంపద నాశనమై పోయింది. రాకపోకల మార్గాలు (వాణిజ్య సంబంధాలు) స్థంభించాయి. మాపై వర్షం కురిపించమని కాస్త దైవ సన్నిధిలో ప్రార్థించండి' అని ఆ వ్యక్తి విన్నవించుకున్నాడు. ఆయన (స) అప్పటికప్పుడే చేతులెత్తి ఇలా ప్రార్థించారు, "ఓ దేవా! మా విన్నపాన్ని మన్నించి వర్షం కురిపించు. ఓ దేవా!! మా మొరను ఆలకించి మాపై నీ కారుణ్యాన్ని అవతరింపజెయ్యి."..... ఈ విధంగా హదీసునంతటినీ వివరించారు. ఇందులో వర్షం ఆపమని ప్రార్థించిన ప్రస్తావన కూడా ఉంది. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్తలు సయితం అక్కరలు తీర్చమని దేవాన్నే వేడుకుంటారనీ, వారంతట వారుగా ఏమీ చెయ్యజాలరని, ఆఖరికి అంతిమ దైవప్రవక్త (సఅసం) సయితం తనంతట తానుగా తన అనుచర సమాజానికి ఏమీ చెయ్యలేరని ఈ హదీసు స్పష్టంచేస్తోంది. అలాగే దైవప్రవక్త (స) నేరుగా దైవాన్నే ప్రార్థించారు. మధ్యలో ఇతర ప్రవక్తల ఆసరాగానీ, సిఫారసుగానీ పొందలేదు. ప్రవక్త ప్రియసహచరులు సయితం; తమకేదైనా ఆపద వచ్చిపడితే దాన్ని తొలగించగలవాడు కేవలం అల్లాహ్‌యేనని దృఢంగా విశ్వసించేవారు. దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన వ్యక్తి, తమ ప్రాంతంలో వర్షం కురిపించమని ప్రవక్త (స) ను కోరలేదు, వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించమని మాత్రమే విన్నవించుకున్నాడు. ఇదే తౌహీద్ (ఏక దైవారాధన).

దైవప్రవక్తలకు అగోచర జ్ఞానముండదు. అగోచర జ్ఞానమే గనక మహాప్రవక్త (స)కు ఉండివుంటే దుర్భిక్షం తాండవిస్తున్న ప్రాంత ప్రజల కష్టసుఖాలు ముందుగానే ఆయనకు తెలిసి ఉండేవి. కాని ఆ వ్యక్తి వచ్చి తమ బాధలు చెప్పుకున్న మీదటే అసలు సంగతి ఆయనకు అవగతమయ్యింది.

ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. అబూ సుఫ్యాన్ అని కొంతమంది అభిప్రాయపడ్డారు. కాని అప్పటికింకా ఆయన ఇస్లాం స్వీకరించలేదు. విన్నపం చేసుకున్న తీరునుబట్టి ఆ వ్యక్తి తప్పక ముస్లిం అయి ఉంటాడని అర్థమవుతున్నది. అతడే గనక ముస్లిం కాకపోయినట్లయితే వర్షం కురిపించమని నేరుగా దైవప్రవక్తనే అభ్యర్థించి ఉండేవాడు.

ఈ హదీసు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమిటంటే వర్షం కొరకు ఆయన (స) కేవలం 'దుఆ' చేశారు. నమాజ్ చేయలేదు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) బహుశా ఈ హదీసు ఆధారంగానే కాబోలు 'వర్షం కొరకు దుఆ చేస్తే సరిపోతుంది, నమాజ్ చేయవలసిన అవసరం లేద'ని అభిప్రాయపడ్డారు. అయితే ఇతర హదీసుల ద్వారా నమాజ్ కూడా చేయవచ్చని రూఢీ అవుతున్నది.

వివిధ ఉల్లేఖనాలన్నింటినీ ఒకచోట చేర్చి, వాటిని జోడిస్తే ఆయన (స) 6 పద్ధతుల్లో వర్షం కొరకు దైవాన్ని అర్థించారన్న వాస్తవం మన ముందుకు వస్తుంది. (1) ఒకసారి ఆయన (స) జనులను ఈద్గాహ్‌లోకి పిలుచుకు వెళ్ళి నమాజ్ చేయించారు, ప్రసంగించారు, వేడుకోలు చేశారు. (2) ఒకసారి జుమా ప్రసంగం సందర్భంగా వేదికపైనుంచి కేవలం దుఆ చేశారు. (3) ఒకసారి ఆయన (స) వేదికను తెప్పించి, దానిపై కూర్చుని దుఆ చేశారు. (4) ఒకసారి నమాజ్ ముగించిన పిదప అందరితో కలసి సామూహిక దుఆ చేశారు. (5) ఒకసారి జనవాసాలను దాటి (బహిరంగ స్థలానికి) వచ్చి 'అహ్‌జారుజ్జైత్' అనే స్థలంలో దుఆ చేశారు. (6) ఒకసారి యుద్ధసమయంలో వర్షం కొరకు అల్లాహ్‌ను ప్రార్థించారు.

409. హజ్రత్ అనస్ (రజి) కథనం : ప్రజలు కరువు కాటకాలకు గురైనపుడు హజ్రత్ ఉమర్ (రజి) గారు హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి)ను మధ్యవర్తి (వసీలా)గా చేసి వర్షం కొరకు

(٤٠٩) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ كَانَ إِذَا قَحَطُوا اسْتَسْقَى بِالْعَبَّاسِ بْنِ عَبْدِ الْمُطَّلِبِ، وَقَالَ:

اللّٰهُمَّ إِنَّا كُنَّا نَسْتَسْقِيْ إِلَيْكَ بِنَبِيِّنَا فَتَسْقِيْنَا، وَإِنَّا نَتَوَسَّلُ إِلَيْكَ بِعَمِّ نَبِيِّنَا فاسْقِنَا، فَيُسْقَوْنَ. رَوَاهُ الْبُخَارِيُّ.

అర్థించేవారు. ఆయన (రజి) ఈ విధంగా వేడుకునేవారు: “ఓ దేవా! మేము నిన్ను నీ ప్రవక్త (సఅసం) ఆధారంగా వర్షం కొరకు ప్రార్థించగా నీవు మాపై దయ దలచి వర్షం కురిపిస్తూ ఉండేవాడివి. మరి ఇప్పుడు నీ ప్రవక్త (సఅసం) పిన తండ్రిని మధ్యవర్తిగా నీ సమక్షంలోనికి తీసుకువచ్చాము. కనుక నీవు మాపై వర్షాన్ని కురిపించి మా కష్టాలు తీర్చు.” (ఈ దుఆ స్వీకారానికి ప్రతీకగా) వారిపై వర్షం కురిసేది. (బుఖారీ)

**సారాంశం**

సమాధి పూజ చేసే వారికీ, చిల్లర దేవుళ్లను ఆశ్రయించేవారికి ఈ హదీసు ‘ఒక ఆయుధం’గా తోడ్పడింది. ఈ హదీసులోని భావాన్ని వక్రీకరించి అమాయక జనులను పెడత్రోవ పట్టించడంలో వారు చాలామటుకు సఫలీకృతులయ్యారు. ప్రవక్త ప్రియసహచరులంతటివారే పుణ్యపురుషులను మధ్యవర్తి (వసీలా) గా చేసుకున్నప్పుడు మనం అలా చేయటంలో అభ్యంతరం ఏముందీ? అని వీళ్లు వేలకొలదీ ప్రశ్నలను ఉత్పన్నం చేశారు. వాస్తవానికి ఈ హదీసుకు ఈ మహానుభావులు చెబుతున్న భాష్యం తప్పుడు భాష్యం. వీళ్లు బ్రతికివున్న వాళ్ళనేకాదు, చనిపోయినవాళ్ళనీ, దగ్గరవున్న వాళ్ళనీ, లేనివాళ్ళనీ, వాళ్ల పేర్లనూ కూడా ‘వసీలా’గా చేస్తున్నారు. కాగా; కేవలం బ్రతికి ఉన్న వాళ్ళను దుఆ కొరకు మధ్యవర్తిగా ఉదాహరించవచ్చని మాత్రమే ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ మహానుభావులు తలపోస్తున్నట్లుగా మరణించిన వారిని కూడా ‘వసీలా’గా ఆశ్రయించటం ధర్మసమ్మతమై ఉంటే ప్రవక్త (స) గారి పినతండ్రిని మధ్యవర్తిగా చేయవలసిన ఖర్మ హజ్రత్ ఉమర్ (రజి)గారికి ఎందుకు పట్టేది? నేరుగా ఆయన దైవప్రవక్త (స)నే మధ్యవర్తి (వసీలా) గా చేసుకుని ఉండేవారుకదా! కాని ఇటువంటి ‘వసీలా’కు సంబంధించి ఖుర్ఆన్‌లోగానీ, హదీసులోగానీ ఎక్కడా ఎలాంటి సూచనా లేదు.

ఈ హదీసు మనకు మూడు విషయాలను నొక్కి పలుకుతోంది. ఒకటి: వర్షాన్ని కోరుతూ ప్రార్థించదలచినపుడు సజ్జనులను, దైవప్రవక్త (స) వంశానికి చెందిన దైవభక్తిపరాయణుడ్ని వెంటబెట్టుకు వెళ్ళవచ్చు. ఈ హదీసు ద్వారా హజ్రత్ అబ్బాస్ (రజి)గారి ధర్మపరాయణత, పెద్దరికం వ్యక్తమవుతున్నాయి. దైవప్రవక్త (సఅసం) కుటుంబీకులలో ఆయన (రజి) నిజంగానే కీలకమయిన వ్యక్తి, పెద్దమనిషి. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి)లోని వినయ వినమ్రతలు కూడా ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నాయి. ఆయన ఒక ఖలీఫా అయివుండి కూడా దైవప్రవక్త (స)

కుటుంబీకుల్లోని ఒక ప్రముఖ వ్యక్తికి పెద్దపీట వేశారు. ప్రార్థన కోసం హజ్రత్ అబ్బాస్ (రజి)ను మధ్యవర్తిగా ఉంచారు. బ్రతికివున్న మనిషి చనిపోయిన వ్యక్తికన్నా అధమశ్రేణికి చెందినవాడైనప్పటికీ, అతని చేతనే దుఆ చేయించాలన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. చనిపోయిన వ్యక్తి 'వసీలా'ను ఆశ్రయించటం షరీయత్‌పరంగా నిరూపితం కాలేదు.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి) దైవప్రవక్త (సఅసం) కు స్వయాన పినతండ్రి. ఈయన నామాంతరం అబుల్ ఫజల్. కాబా గృహ వ్యవహారాల పర్యవేక్షణ, హజ్ యాత్రికులకు మంచినీరు సరఫరా చేయటం వంటి బాధ్యతలు ఈయనపై ఉండేవి. 'అఖబా ఒప్పందం' సందర్భంగా ఈయన కూడా హాజరయ్యారు. ఒప్పందానికి కట్టుబడి ఉండవలసిన ఆవశ్యకతను అన్సార్లకు నొక్కి చెప్పడానికి ఆయన ఆ సందర్భంగా అక్కడికి వచ్చారు. విచిత్రమేమిటంటే అప్పటికింకా ఆయన ముస్లిం కారు. బద్ర్ యుద్ధంలో యుద్ధ ఖైదీగా పట్టుబడ్డారు. మక్కా విజయానికి కొన్నాళ్ల క్రితమే ఇస్లాం స్వీకరించారు. ఆ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. హునైన్ యుద్ధం జరిగిన రోజున మొక్కవోని వీరునిలా నిలిచారు. హిజ్రీ 32వ సంవత్సరం రజబ్ లేక రమజాన్ నెలలో కన్ను మూశారు. మదీనాలోని జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(٤١٠) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أَصَابَنَا - وَنَحْنُ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ - مَطَرٌ، قَالَ: فَحَسَرَ ثَوْبَهُ حَتَّى أَصَابَهُ مِنَ الْمَطَرِ، وَقَالَ: إِنَّهُ حَدِيثُ عَهْدٍ بِرَبِّهِ. رَوَاهُ مُسْلِمٌ.

410. హజ్రత్ అనస్ (రజి) గారే ఈ విధంగా ఉల్లేఖించారు: "మేమొకసారి వర్షంలో చిక్కుకున్నాము. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా మా వెంట వున్నారు. ఆయన (సఅసం) తన భుజాలపై ఉన్న వస్త్రాన్ని పైకి ఎత్తుకున్నారు. వర్షపు చినుకులు ఆయన (స) ఒంటిపై పడసాగాయి. 'ఇవి నా ప్రభువు, యజమాని తరపున కొంగ్రొత్త కానుకల రూపంలో ఇవ్వబడుతున్నాయి' అని ఆయన (స) సెలవిచ్చారు." (ముస్లిం)

### సారాంశం

ఈ వర్షం పరమ ప్రభువు తరపున పంపబడింది. మరో విశేషమేమిటంటే ఈ వర్షపు నీటిని అప్పటివరకూ ఏ పాపాత్ముడు కూడా ముట్టుకోలేదు. దుర్మార్గులు, దుష్టులు నివసిస్తున్న ప్రాంతాలకు ఈ నీరు ఇంకా చేరలేదు. అదీగాక ఆ వర్షపు చినుకుల్లో శుభశ్రేయాలు ఎన్నో నిండి ఉండవచ్చు. అందుచేత వర్షపు నీటిలో తడవటం, స్నానం చేయటం ఒక విధంగా మంచిదే.

411. హ॥జత్ ఆయిషా (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్షం కురవటాన్ని గమనించినప్పుడల్లా ఇలా వేడుకునేవారు - "ఓ అల్లాహ్! ఈ వర్షాన్ని మా కొరకు లాభసాటిగా, ఫలవంతంగా చెయ్యి."

(బుఖారీ, ముస్లిం)

(٤١١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا رَأَى الْمَطَرَ قَالَ: «اللَّهُمَّ صَيِّباً نَافِعاً». أَخْرَجَاهُ.

412. హ॥జత్ సాద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇస్తిస్ఖా వేడుకోలు ఈ విధంగా చేశారు- "ఓ దేవా! భూమి అంతటినీ క్రమ్ముకున్న మబ్బుల ద్వారా, దట్టమైన మేఘాల ద్వారా, గర్జించే మేఘాల ద్వారా, ధారాపాతంగా కురిసే, మెరిసే, గర్జించే మేఘాల ద్వారా, నిరంతరం వర్షించే మేఘాల ద్వారా మాపై చిటపట చినుకుల రూపంలో అధిక వర్షం కురిపించు- ఓ ఘనతా గౌరవాల అధిపతీ!"

(ముస్నద్ అబూఅవానా)

(٤١٢) وَعَنْ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ دَعَا فِي الاسْتِسْقَاءِ: «اللَّهُمَّ جَلِّلْنَا سَحَاباً كَثِيفاً، قَصِيفاً، دَلُوقاً، ضَحُوكاً، تُمْطِرُنَا مِنْهُ رُذَاذاً، قِطْقِطاً، سَحْلاً، يَا ذَا الْجَلَالِ وَالْإِكْرَامِ». رَوَاهُ أَبُو عَوَانَةَ فِي صَحِيحِهِ.

**సారాంశం**

దుఆయె ఇస్తిస్ఖాలలో ఈ దుఆ ఒకటి. దైవప్రవక్త (సఅసం) వర్షాన్ని కోరుతూ అనేక రకాల దుఆలు చేశారు. వాటిలో దేనినయినా తీసుకోవచ్చు.

413. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హ॥జత్ అబూ హురైర (రజి) తెలియజేశారు : "హ॥జత్ సులైమాన్ - అలైహిస్సలాం - వర్షాన్ని అర్థించటానికి బయటికి వచ్చారు. ఆ సమయంలో ఒక చీమ తన వెనుకటి కాళ్లను ఆకాశం వైపునకు ఎత్తి దైవాన్ని వేడుకోవటం ఆయన గమనించారు.

(٤١٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: خَرَجَ سُلَيْمَانُ عَلَيْهِ السَّلَامُ يَسْتَسْقِي، فَرَأَى نَمْلَةً مُسْتَلْقِيَةً عَلَى ظَهْرِهَا، رَافِعَةً قَوَائِمَهَا إِلَى

السَّمَاءِ، تَقُولُ: اللّٰهُمَّ إِنَّا خَلْقٌ مِنْ خَلْقِكَ، لَيْسَ بِنَا غِنًى عَنْ سُقْيَاكَ، فَقَالَ: «ارْجِعُوا فَقَدْ سُقِيتُمْ بِدَعْوَةِ غَيْرِكُمْ». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ الْحَاكِمُ.

ఆ చీమ ఇలా వేడుకోసాగింది: "దేవా! నీవు సృష్టించిన ఇతర ప్రాణుల మాదిరిగానే మేము నీ ప్రాణులం. నీ వర్షపు నీరు లేకుండా మేము కూడా మనజాలము." ఇది విన్నంతనే హజ్రత్ సులైమాన్ అలైహిస్సలాం, "తిరిగి వెళదాం పదండి, ఇతర జీవాల ప్రార్థనా ఫలంగా మీపై వర్షం కురిసినట్లే" అని వ్యాఖ్యానించారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

అంతిమ దైవప్రవక్త (సఅసం)కు ముందు గతించిన ప్రవక్తలు కూడా అనావృష్టి ఏర్పడినపుడు ఇళ్లనుండి బయటికి వచ్చి వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఒక చిన్న చీమ చేసుకున్న విన్నపం ఆధారంగా ప్రాణులన్నింటికీ వర్షపు నీరు లభ్యమవటం యోచించదగ్గ విషయం. నమాజె ఇస్తిస్ఖా అయినా, దుఆయె ఇస్తిస్ఖా అయినా గ్రామం లేక పట్టణం బయటికి వచ్చి, చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో చేయటం అభిలషణీయం.

(٤١٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ اسْتَسْقَى فَأَشَارَ بِظَهْرِ كَفَّيْهِ إِلَى السَّمَاءِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

414. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్షం కొరకు దుఆ చేసినప్పుడు, రెండు (అర) చేతుల్నీ తిరగవేసి ఆకాశం వైపునకు చాచారు. (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) చేతుల్ని తిరగవేసి దుఆ చేసినట్టు ఉంది. సాధారణంగా ఆయన (స) అలా చేయరు. ఈ రెండు పద్ధతులకూ మధ్య గల వ్యత్యాసాన్ని తెలుపుతూ విద్వాంసులు ఇలా అన్నారు: కారుణ్యాన్ని అర్థిస్తున్నప్పుడు ఆయన (స) చేతుల్ని తిన్నగానే ఉంచేవారు. కాని ఏదైనా దుస్థితినీ, దురవస్థను దూరం చేయమని కోరుతున్నప్పుడు మాత్రం చేతుల్ని తిరగవేసేవారు. పరిస్థితిని ఈ విధంగా మార్చమన్న దానికి సంకేతంగా ఆయన (స) అలా చేసేవారు! దుఆయే ఇస్తిస్ఖా సందర్భంగా ఆయన (స) తన దుప్పటిని తిరగవేయటంలో ఉద్దేశ్యం కూడా బహుశా అదే అయి ఉంటుంది.